క్లుప్తంగా...

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

మేడ్చల్: బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మేడ్చల్‌లో బీజేపీ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. జాతీయ రహదారిపై రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఊరేగించి ఈటల రాజేందర్‌కు, బీజేపీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ వివేకానంద విగ్రహం వద్ద రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ నాయకులు ఆంజనేయులు, ప్రేందాస్, నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి పరిధిలో ఔటర్‌రింగు రోడ్డు సర్వీసు రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ ప్రారంభించారు. పీజేఎస్ పాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. చలివేంద్రం సందర్భంగా క్రైస్తవ మత పెద్దలు ప్రార్థనలు చేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



23వ వార్డులో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి

మేడ్చల్: పట్టణ పరిధిలోని రెండు వార్డుల్లో మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. 23వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు పూజ కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు.

గిర్మాపూర్‌లో..

గిర్మాపూర్‌లోని వార్డులో రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రెండు కార్యక్రమాల్లో కౌన్సిలర్లు కొడే మహేష్, లావణ్య హన్మంత్‌రెడ్డి, కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, డీఈ విజయలక్ష్మి, మున్సిపల్ ఆర్ఐ రాంచందర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం



సత్కరిస్తున్న చైర్ పర్సన్, కౌన్సిలర్లు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన త్రిలేశ్వర్‌రావును మున్సిపల్ కౌన్సిల్ కౌన్సిలర్లు, చైర్ పర్సన్, బీజేపీ నాయకులు సన్మానించారు. కమిషనర్ చాంబర్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి, కౌన్సిలర్లు నూతన కమిషనర్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. బీజేపీ నాయకులు కమిషనర్‌ను సన్మానించారు.

నూతన టీపీఓకు..

నూతన టీపీఓగా బాధ్యతలు చేపట్టిన రాధాకృష్ణారెడ్డిని ఆయన చాంబర్‌లో చైర్ పర్సన్, కౌన్సిలర్లు సన్మానించారు. కౌన్సిలర్లు కొడె మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్, నాయకులు శ్రవణ్‌కుమార్, మధుకర్ తదితరులున్నారు. బీజేపీ నాయకులు ఆంజనేయులు, ప్రేందాస్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్ హేమలతారెడ్డి, అర్జున్, వంశీ, వంశీరెడ్డి ఉన్నారు.

వలస కూలీలపై బెదిరింపులకు పాల్పడితే చర్యలు

శామీర్‌పేట్: వలస కూలీలపై బెదిరింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు సోమవారం శామీర్‌పేట పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఒరిస్సాకు చెందిన అంతార్ భాయ్, మరో 13 మందితో కలిసి ఇటుక బట్టీల్లో పని నిమిత్తం రాజ్‌కుమార్ అనే వ్యక్తితో కలిసి మూడుచింతలపల్లి మండలం, ఉద్దమర్రి గ్రామానికి 5 నెలల క్రితం వచ్చి ఇటుక బట్టీ యజమాని దీప్తా వద్ద పనిచేస్తున్నారు. వెయ్యి ఇటుకలు తయారు చేస్తే రూ.120 జీతం ఇవ్వాల్సి ఉండగా, దీప్లా, అతని కుమారుడు రాజశేఖర్ రూ.60 ఇచ్చేవారిని బాధిత కూలీలు ఆరోపించారు. ఫిబ్రవరి 16న బట్టీ యజమాని కూలీల వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, ఆధార్‌కార్డులు తీసుకొని చేయాల్సిన పనికంటే ఎక్కువ పని చేయాలని అంటున్నారని పేర్కొన్నారు. శామీర్‌పేట ఎస్‌హెచ్ఓ సుధీర్‌కుమార్, మూడుచింతలపల్లి తహసీల్దార్ వాణిరెడ్డితో కలిసి ఉద్దమర్రిలోని ఇటుకబట్టీని సందర్శించి, బాధిత కూలీల వద్ద పూర్తి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అన్నోజిగూడలో వీబీఎస్ ప్రారంభం

పోచారం: అన్నోజిగూడలోని క్రీస్తు జ్ఞాన మందిరంలో నాలుగు రోజుల పాటు కొనసాగే ఒకేషనల్ బైబిల్ స్కూల్‌ను సోమవారం ప్రారంభించారు. స్కూల్ విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు నక్షత్రమ్మ తెలిపారు. విద్యార్థులకు ఆధ్యాత్మిక, నైతిక విలువలతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

ఆటాడుకుందాం రా..!

వేసవి సెలవుల్లో విద్యార్థులకు నెల రోజుల ఉచిత శిక్షణ



- మే 1 నుంచి 31 వరకు 14 ఏళ్లలోపు చిన్నారులకు..
- నిపుణులైన పీఈటీలతో మెరుగైన శిక్షణకు ఏర్పాట్లు
- ఈ వేసవిలో ఉద్యోగులకు కూడా అవకాశం
- ప్రభుత్వం నుంచి జిల్లాకు రూ.1.05 లక్షల మంజూరు

సాక్షి, మేడ్చల్ జిల్లా: వేసవి సెలవుల్లో విద్యార్థులకు నెల రోజుల పాటు ఉచితంగా క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి 31 వరకు చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో అనుభవజ్ఞులైన క్రీడాకారులు, పీఈటీల పర్యవేక్షణలో 10 శిబిరాల ద్వారా శిక్షణ అందించనున్నారు. జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలోనే నెల రోజుల వరకు వివిధ క్రీడాంశాలతోపాటు గ్రామీణ క్రీడలపై శిక్షణ ఇస్తారు. వేసవిలో ఇళ్లలో ఖాళీగా ఉండే పిల్లలకు ఇది చక్కటి అవకాశంగా వినియోగించుకోవాలని కోరుతున్నారు.

సమయం వృథా కాకుండా..

14 ఏళ్లలోపు బాలబాలికలు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు అర్హులు. వేసవి సెలవులు వృథా కాకుండా వారికి ఇష్టమైన ఆటల్లో ప్రత్యేక శిక్షణ కల్పించనున్నారు. ఆధునిక యుగంలో పిల్లలు స్మార్ట్ ఫోన్లు, టీవీలకు అతుక్కుపోయి, చిన్న వయసులోనే అనారోగ్యాలు కొనితెచ్చుకుంటున్నారు. సెలవులను గ్రామీణ, పట్టణ ప్రాంతం పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. కొన్నేళ్లుగా ఏటా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల ఆవరణ, అందుబాటులో ఉన్న మైదానాలు, క్రీడా ప్రాంగణాల్లో వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

ఉద్యోగులకు కూడా...

ఈ వేసవి సెలవుల్లో ఉద్యోగులకు కూడా వివిధ క్రీడాంశాల్లో శిక్షణతో సహా ఆటలు ఆడుకునేలా ప్రోత్సహించడంతో పాటు వారిలో మానసిక ఉల్లాసాన్ని, శరీర దారుఢ్యాన్ని పెంపొందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అందులో భాగంగా అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులను వేసవి క్రీడల్లో భాగస్వాములను చేయాలని భావిస్తోంది. మహిళా ఉద్యోగులను కూడా ఈ క్రీడాంశాల్లో భాగస్వాములను చేస్తారు.

నిధుల కేటాయింపు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.05 లక్షల నిధులు కేటాయించింది. క్రీడా పరికరాల కొనుగోలుకు రూ.50 వేలు, ఒక్కో కోచ్‌కు రూ.4 వేల చొప్పున, మొత్తం జిల్లాలో పది శిక్షణ శిబిరాలు నిర్వహించుకునేందుకు రూ.40 వేలు కోచ్‌లకు గౌరవ వేతనం కోసం కేటాయించారు. ప్రమాదంలో గాయాలైతే ప్రాథమిక చికిత్స అందించేందుకు మెడికల్ కిట్‌కు రూ.5 వేలు, ఇతరత్రా నిర్వహణకు రూ.10 వేలు ఖర్చు చేయనున్నారు.

నైపుణ్యాన్ని మెరుగు పర్చుకోవచ్చు..

ఆటలకు దూరమైన పాఠశాలలకు చెందిన పిల్లలు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే క్రీడా నైపుణ్యాన్ని మరింత మెరుగు పర్చుకోవచ్చు. ముఖ్యంగా వేసవిలో సమయం వృథా కాకుండా ఇష్టమైన ఆటను నేర్చుకుని పట్టుసాధించే అవకాశం ఉంటుంది. సమయ పాలన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవాటు, ఆటలు ఆడుకునే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారు. భవిష్యత్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశాలుంటాయి. ఈ క్రీడల్లో పతకాలు సాధిస్తే క్రీడా కోటా కింద ఉన్నత విద్య అభ్యసించవచ్చు. ఉపాధి అవకాశాలకు కూడా ఆ పతకాలు ఎంతో ఉపయోగపడుతాయి.

అన్ని వసతులు కల్పిస్తాం

వేసవి దృష్ట్యా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడా శిక్షణ శిబిరాల్లో చిన్నారులకు అన్ని వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటాం. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆటలు నిర్వహిస్తారు. ఇప్పటికే కోచ్‌ల నియామకం కోసం ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. శిక్షణ శిబిరాల్లో తాగునీరు, తదితర అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. మెడికల్ కిట్లు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు తమ నైపుణ్యాన్ని మెరుగు పర్చుకోవాలి. ఉద్యోగులను కూడా వివిధ క్రీడాంశాల్లో భాగస్వాములను చేసేందుకు అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్నాం.

– బి.బలరామారావు,
జిల్లా యువజన క్రీడల అధికారి, మేడ్చల్ జిల్లా

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

జవహర్‌నగర్ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని జవహర్‌నగర్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ఎస్‌డీఎఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ హాజరై మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యం కల్పిస్తోందన్నారు. జవహర్‌నగర్‌లోని మహిళ స్వయం ఉపాధి కోసం ఎస్‌డీఎఫ్ చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నాగరాణి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రెడ్డిశెట్టి మహేష్, ఎస్‌డీఎఫ్ ప్రధాన కార్యదర్శి బుడిగె సవితగౌడ్, సభ్యులు రమేష్, ఎలిషా, మంజుల, సంపూర్ణ, మౌనిక, వనిత, శ్రీమన్, సయీమ్ తదితరులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మించాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబర్–347 ప్రభుత్వ భూమిలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మించేందుకు కృషి చేయాలని కోరుతూ ఏఐఎఫ్‌బీ నాయకులు సోమవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌బీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి జంగిడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్ పరిధిలో అనేక ప్రభుత్వ స్థలాలు ఉన్నా సరైన వైద్య సదుపాయం లేదన్నారు. దూర ప్రాంతాలకు తీసుకెళ్లే సమయంలో ప్రాణాలు పోతున్నాయన్నారు. గతంలో మంత్రి మల్లారెడ్డి ఎన్నికల పర్యటనలో వంద 100 పడకల ఆస్పత్రి హామీ నెరవేర్చలేదన్నారు. సర్వే నెంబర్–347 ప్రభుత్వ స్థలంలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మించాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ నాయకులు రుద్రవెల్లి బబ్లుచారి, మంగళంపల్లి తిరుపతి, కోడూరి శ్రవణ్, ప్రదీప్ పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న ఏఐఎఫ్‌బీ నాయకులు

ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలి

డీఆర్ఓ లింగ్యానాయక్




సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో ప్రజలు అందించే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టితో తక్షణమే స్పందించాలని డీఆర్ఓ లింగ్యానాయక్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 94 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టి, పరిష్కరించాలన్నారు. మల్లాపూర్‌కు చెందిన సీనియర్ సిటీజన్లు తమ అసోసియేషన్ భవనానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని వినతి పత్రం సమర్పించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ధరణికి సంబంధించి మిస్సింగ్ సర్వే నంబర్లు, భూ విస్తీర్ణంలో తేడాలు, భూమి రకంలో తేడాలు, నిషేధిత జాబితా నుంచి తొలగించడం, పట్టా భూమి అసైన్డ్ భూములుగా నమోదవడం వంటి సమస్యలపై పలువురు వినతి పత్రాలు అందజేశారు. భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలపై కూడా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డీపీఓ వేధింపులపై చర్యలు తీసుకోవాలి

జిల్లా పంచాయతీ అధికారి ఇతర రాజకీయ నాయకులతో కుమ్మక్కై తనపై కక్ష పూరిత చర్యలకు పూనుకుంటున్నారని గౌడవెల్లి సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్ఓ లింగ్యానాయక్‌కు ఫిర్యాదు చేశారు. రెండు సంవత్సరాల నుంచి గ్రామ పంచాయతీలో లేని దాన్ని ఉన్నట్లు చూపించి సంబంధిత అధికారులపై ఒత్తిడి చేసి తప్పుడు నివేదికలు తెప్పించుకొని వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. తనను వేధిస్తున్న డీపీఓపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.

గంజాయి విక్రేత అరెస్టు



ఘట్‌కేసర్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన చాగం చంద్రశేఖర్‌రెడ్డి(28) ఘనాపూర్‌లో నివాసముంటూ పెయింటర్‌గా పని చేస్తున్నాడు. పోలీసులు సోమవారం అతడి వద్ద నుంచి 950 గ్రాముల గంజాయి, ఎఫ్‌జెడ్ బైక్, ఐ ఫోన్, పైపును స్వాధీనం చేసుకున్నారు. దూల్‌పేట్‌లో గంజాయి కొనుగోలు చేసి ఘట్‌కేసర్, మైసమ్మగుట్ట, ఘనాపూర్‌లో విక్రయిస్తుంటాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాల శ్రీనివాసమూర్తి మృతి తీరని లోటు

– అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి

సాక్షి, మేడ్చల్‌జిల్లా: సుప్రసిద్ధ సాహిత్య విమర్శకులు ఆచార్య గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి మృతి తెలుగు సాహిత్య ప్రపంచానికి తీరని లోటని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి తెలిపారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితచరిత్ర, ఆత్మకథలో అలనాటి తెలంగాణ గ్రంథాల ద్వారా సాహిత్యంపై తనదైన ముద్రవేసిన సహృదయ సాహితీవేత్త బాలశ్రీనివాసమూర్తి అన్నారు. వారి మృతికి అశ్రునివాళి అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వచ్చే నెల 3న జెడ్పీ సమావేశం

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం మే 3వ తేదీన ఉదయం 11 గంటలకు చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన జరగనున్నట్లు జెడ్పీ సీఈఓ దేవసహాయం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ముఖ్యఅతిథులుగా జిల్లా మంత్రి మల్లారెడ్డి, ఎంపీ రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు.

చలివేంద్రం ప్రారంభం



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 25వ డివిజన్ ప్రధాన రహదారిలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సోమవారం మేయర్ మేకల కావ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయన్నారు. అదేవిధంగా బయటకు వెళ్లే ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జమాల్‌పూర్ నవీన్‌కుమార్, జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కీసర ఇన్‌చార్జి ఎంపీడీఓగా లక్ష్మీవత్సలదేవి



కీసర: కీసర మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా మూడుచింతలపల్లి మండలం ఎంపీడీఓ కె.లక్ష్మీ వత్సలదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.లక్ష్మీవత్సలదేవిని కీసర మండల ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ జె.సత్తిరెడ్డి, మండల పరిషత్ సిబ్బంది, వివిధ గ్రామాల కార్యదర్శులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మొన్నటి వరకు కీసర ఎంపీడీఓగా విధులు నిర్వర్తించాలని రమాదేవి ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన విషయం విదితమే.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లు



చీర్యాల, తిమ్మాయిపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున విద్యార్థులకు వివిధ మౌలిక వసతుల కల్పన పనులు చేపడుతున్నట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం చీర్యాల, తిమ్మాయిపల్లి గ్రామాల్లో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.50 లక్షలతో కొత్తగా నిర్మించిన అదనపు గదులతో పాటు విద్యార్థులు కూర్చొనేందుకు ఏర్పాటు చేసిన ఫర్నీచర్, కంప్యూటర్ ల్యాబ్, బాత్‌రూంలు, కిచెన్‌షెడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులు కోసం ప్రైవేటు స్కూళ్లకు దీటుగా సౌకర్యాలు కల్పించడంతోపాటు, నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో విద్యకు పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. ఒకప్పుడు ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాల్లో అనేక సౌకర్యాలు, చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు, మధ్యాహ్న భోజనం, ఇంగ్లిష్ మీడియంలో చదువులు తదితర సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. ఇకముందు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

- రాష్ట్రంలో విద్యతోపాటు, వైద్యరంగానికి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.10 వేల కోట్ల నిధులను బడ్జెట్‌లో కేటాయించిందన్నారు. రాష్ట్రం దేశానికే ఆదర్శ రాష్ట్రంగా ముందుకెళ్తోందని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలంతా సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలన్నారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ, జెడ్పీవైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డి, సర్పంచులు తుంగ ధర్మేందర్, పెంటయ్య, చీర్యాల దేవాలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ సభ్యులు ప్రమీల, నారాయణశర్మ, ఉపసర్పంచులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సింగారం నారాయణ, నేతలు శ్రీనివాస్, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతా, శిశు ఆరోగ్య సేవలను బలోపేతం చేయాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలలో గర్భిణులకు 300 టిఫా స్కాన్ కచ్చితంగా నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ వైద్యాధికారులను ఆదేశించారు. మాతా, శిశు ఆరోగ్య సేవలను బలోపేతం చేయడం లక్ష్యంగా పని చేయాలన్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీష్‌రావు ఆదేశాల మేరకు సోమవారం మల్కాజిగిరిలో ఆరోగ్య సేవల జిల్లా కో ఆర్డినేటర్ డాక్టరు కోట్యానాయక్‌తో కలిసి ఆయన జిల్లా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్య సిబ్బంది హేతుబద్ధీకరణతోపాటు బర్త్ ప్లానింగ్, ఐఫ్ఏటాబ్లెట్స్, కుటుంబ నియంత్రణ, ఆరోగ్య మహిళా, 24 గంటల ల్యాబ్, ఎమర్జెన్సీ ఆపరేషన్లు, పోస్ట్ మోర్టర్మ్ సేవలను నిర్వహించాలని సూచించారు. వైద్యులు సిజేరియన్లను తగ్గించాలన్నారు. సమావేశంలో మల్కాజిగిరి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్, ఆర్ఎంఓ డాక్టరు సంగీత్, వైద్యాధికారులు డాక్టర్ ఆనంద్, శామీర్‌పేట్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్, వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఓడించే సత్తా కాంగ్రెస్‌కే ఉంది

టీ పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్: రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఓడించే సత్తా కాంగ్రెస్‌కే ఉందని టీ పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఘట్‌కేసర్ మండల శాఖ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రను పురస్కరించుకొని అంకుషాపూర్, అవుషాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను సోమవారం ఆవిష్కరించారు. వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సంక్షేమ పథకాలు ప్రారంభించడమే కానీ పూర్తిగా కొనసాగించింది లేదన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి దేశాన్ని ఉద్ధరిస్తానని సీఎం కేసీఆర్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జోడో యాత్రలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత, మేడ్చల్ ఏ, బీ బ్లాక్ అధ్యక్షులు పోచయ్య, మహేశ్‌గౌడ్, బోడుప్పల్ కార్పొరేటర్ అజయ్‌యాదవ్, వైస్ ఎంపీపీ జంగమ్మ, కాంగ్రెస్ జవహర్‌నగర్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, మండల అధ్యక్షుడు రాజేశ్, అధికార ప్రతినిధి మాధవరెడ్డి, శామీర్‌పేట్ అధ్యక్షులు నర్సింహులు యాదవ్, అవుషాపూర్, అంకుషాపూర్ అధ్యక్షులు జంగయ్యముదిరాజ్, శంకర్, ముత్యాలుయాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి పాల్గొన్నారు.



అంకుషాపూర్‌లో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న వజ్రేశ్‌యాదవ్

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి



పోచారంలో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

పోచారం: వెనుకబడిన ప్రాంతాల్లో మూడో వంతు బ్యాలెన్స్ బడ్జెట్, శాస్త్రీయ పద్ధతిలో డంపింగ్ యార్డ్ ప్రతిపాదనలు, గ్రీన్ యాక్షన్ ప్లాన్‌లను సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య పోచారం మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపాలిటీలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారపల్లిలో నిర్మిస్తున్న ఎఫ్ఎస్‌టీపీ, జంతు సంరక్షణ కేంద్రం, వైకుంఠధామాలు, సమీకృత మార్కెట్ నిర్మాణం, ట్యాక్స్ కలెక్షన్లను పరిశీలించారు. చైర్మన్ కొండల్‌రెడ్డి, కమిషనర్ సురేష్, ఇతర సిబ్బందిని అడిగి మున్సిపాలిటీ స్థితిగతుల గురించి తెలుసుకున్నారు.

ఔషధ రంగంలో అపార అవకాశాలు

ఐసీఎంఆర్ సైంటిస్ట్ రాజేందర్ రావు



ఘట్‌కేసర్: విద్యార్థులకు ఔషధ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని ఐసీఎంఆర్ సైంటిస్ట్ రాజేందర్ రావు అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ) ఫార్మసీ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రపంచ లాబోరేటరీ అనిమల్స్ డేకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సైంటిస్ట్ రాజేందర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు ఔషధ రంగం పరిశోధనలు, జంతువుల జీవన విధానం ప్రత్యామ్నాయ చర్యలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫార్మసీ డీన్ వసుధ భక్షి లాబోరేటరీ యానిమల్స్ దినోత్సవం ప్రత్యేకతను వివరించారు. కార్యక్రమంలో కృష్ణప్రసాద్, హేమంత్, కిరణ్, సునంద్, నవీన్, సయ్యద్, ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ శుభ్రంగా ఉండేలా చూడాలి

మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ శుభ్రంగా ఉండేలా చూడాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వేమనరెడ్డితో కలిసి పారిశుద్ధ్య కార్మికులకు స్వచ్ఛ్ సర్వేక్షణ్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన రహదారిపై దుకాణదారులు రోడ్డుపై చెత్త వేయకుండా చెత్త డబ్బాలు ఏర్పాటు చేయించాలన్నారు. ఇళ్లలోని చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్తను సేకరించే మున్సిపాలిటీ వాహనంలో ప్రజలతో వేయించాలన్నారు. పారిశుద్ధ్యంలో ప్రజలు కార్మికులకు సహకరించాలని కోరారు. స్వచ్ఛ్ సర్వేక్షణ్ అవగాహన సదస్సులో మున్సిపల్ మేనేజర్ అంజిరెడ్డి, స్వచ్ఛ్ సర్వేక్షణ్ ఇన్‌చార్జ్ యోగేశ్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీయాదవ్